క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ జొన్నాదుల రామారావు తెలిపారు. కాకినాడ ఆపరేషన్స్ ఈఈ జి.ప్రసాద్ మంగళవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే రోడ్డు వెడల్పు పనులలో భాగంగా విద్యుత్ టవర్లు కొన్ని పక్కకు మార్చవలసి ఉందని దాని కారణంగా కాకినాడ 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి గొల్లపాలెం 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. ఫలితంగా గొల్లపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలంలో పలు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి చింతిస్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు.

కపిలేశ్వరపురం తహసీల్దార్‌గా సాయికృష్ణ



సాయికృష్ణకు స్వాగతం పలుకుతున్న వీఆర్వోలు

కపిలేశ్వరపురం: మండల తహసీల్దార్‌గా కె.సాయికృష్ణ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. పాలకొల్లు తహసీల్దార్‌గా పని చేసిన సాయికృష్ణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన కొమరం సూర్యారావు కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. రెవెన్యూ సంబంధిత సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన సాయి కృష్ణ అన్నారు. కాగా ఆయనకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు స్వాగతం పలికారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ద్రాక్షారామ గురుకులం వద్ద మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకుడు సిద్ధూ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన వ్యవహారంలో సంఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ ఆధ్వర్యంలో వారు గురుకుల పాఠశాలను సందర్శించి సంఘటనపై విచారించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సుబ్బాబాయ్, ఏపీ స్టూడెంట్ జేఏసీ అధ్యక్షుడు ప్రత్తిపాటి బుల్లిరాజు, షేక్ అలీ హుస్సేన్, మురళి, ఆర్.సాయి తదితరులు పాల్గొన్నారు.

సరోజినీనాయుడు ఆదర్శమూర్తి



మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): భారత కోకిలగా ప్రసిద్ధి చెందిన స్వాతంత్య్ర మహిళా ఉద్యమ నాయకురాలు సరోజినీ నాయుడు యావత్ భారతదేశ ప్రజలకూ ఆదర్శమూర్తి అని ఆమె జయంతి, జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జయంతి కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు, రామచంద్రపురం డీఎల్‌పీఓ ఎ.శాంతి, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమ నేతల లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. వారిని కళాశాల మహిళా సాధికారత విభాగం సభ్యులు సుధారాణి, కృష్ణవేణి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

తోరాటి వెంకన్న మృతి

కపిలేశ్వరపురం: అంగర గ్రామ ప్రముఖుడు తోరాటి వెంకన్న(71) సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మాజీ ఎంపీపీ నెక్కంటి బాలకృష్ణ వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు, మాజీ సర్పంచ్ సంకా బత్తుల స్వామికాపు సానుభూతిని వ్యక్తం చేశారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చిన ప్రభుత్వం

- మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావాలన్నదే ప్రజల ఆకాంక్ష
- కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- పట్టణంలో గడప గడపకూ..



పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను అమలు చేసి పేదలకు నేరుగా అందించారని తిరిగి పేదల అభ్యున్నతి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలని నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సూర్యప్రకాశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేసి అయిదేళ్ల పాటు ఎక్కడా దళారులు లేకుండా పథకాలను అందించామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే సంక్షేమ పథకాల సొమ్ములను వేయటం జరిగిందన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందేందుకు ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉండేవని, దళారులు దోచుకునే వ్యవస్థ నుంచి ఎటువంటి ఇబ్బందులు దళారులు ప్రమేయం లేకుండా లబ్ధిదారులకే పెద్ద పీట వేయటం జరిగిందని సూర్యప్రకాశ్ వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రైతులకు భరోసాకేంద్రాల ద్వారా, వైద్యం ఆరోగ్యంలోను, విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది వైఎస్ జగన్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. తిరిగి పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇళ్ల పట్టా, గృహనిర్మాణం, ఇన్‌పుట్ సబ్సిడీ వైఎస్సార్ రైతు భరోసా, సున్నావడ్డీ రుణాలు, అమ్మఒడి, ఆసరా తదితర సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న తీరును లబ్ధిదారులను సూర్యప్రకాశ్ అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్ కొండేపూడి సూర్యకుమారి, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నాయకులు కొండేపూడి సురేష్, సత్తి శంకర్‌రెడ్డి, పార్టీ నేతలు, గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



బాలాంత్రంలో వైద్య శిబిరం వద్ద పరీక్షలు చేయించుకుంటున్న దృశ్యం



కుయ్యేరు జగనన్న సురక్షలో రోగికి మెడికల్ కిట్ అందజేస్తున్న సర్పంచ్ కృష్ణమూర్తి తదితరులు

కె.గంగవరం: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని సర్పంచ్ సర్పంచ్ చాగంటి సాంబశివరావు, ఎంపీటీసీ కోట సత్తిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బాలాంత్రం సచివాలయం వద్ద మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి, వారికి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు సలహాలు, సూచనలు కూడా వైద్య సిబ్బంది ఇస్తారన్నారు. ప్రభుత్వం ఆరోగ్యనికి పెద్దపీట వేసిందని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దంగేరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న కృషి

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగనన్న ఎంతగానో కృషి చేస్తున్నారని కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం కుయ్యేరు సచివాలయంలో దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు లక్ష్మీప్రణతి, ఆర్.స్నేహలత, జి.స్వాతి, వై.సుప్రియ, సురేఖనాగలక్ష్మి తదితర నిపుణులైన వైద్యులు పాల్గొని 354 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స నందించటంతో పాటు ఉచిత మందులు పంపిణీ చేశామని 10 మందిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు పంపించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీహెచ్ సత్యనారాయణ, సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నేడు టిడ్కో ప్లాట్ల అందజేత



మండపేట టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలో ఫేజ్-1 టిడ్కో ప్లాట్లను బుధవారం లబ్ధిదారులకు అందజేయనున్నట్టు మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మంగళవారం తెలిపారు. గతంలోనే పంపిణీ జరిగినప్పటికీ ఫేజ్- 1లో మిగిలిన ప్లాట్లను పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించి పంపిణీకి సిద్ధం చేశారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను చైర్‌పర్సన్ పర్యవేక్షించారు. పంపిణీకి సిద్ధమైన ప్లాట్లను పరిశీలించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, షేక్-షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు శెట్టి కళ్యాణి, బొక్కా సరస్వతి, అమలదాసు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, మొండి మురళి, మహంతి అసిరినాయుడు, సాధనాల శివ భగవాన్, శెట్టి నాగేశ్వరరావు, పిఠాపురం సత్యనారాయణ, అడబాల వీరబాబు, గనిపే భూషణం, మున్సిపల్, టిడ్కో అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో లోకేష్ ప్రతిభ



లోకేష్

కె.గంగవరం: ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో సుందరపల్లి గ్రామానికి చెందిన అడపా తరుణ్ వెంకట లోకేష్ ప్రతిభ కనబరిచాడు. మాజీ కోటిపల్లి సొసైటీ అధ్యక్షుడు అడపా నారాయణ స్వామి, సుందరపల్లి మాజీ సర్పంచ్ అడపా రామలక్ష్మి దంపతుల కుమారుడు లోకేష్ మెయిన్స్‌లో 99.36 స్కోరు సాధించాడు. జేఈఈలో ప్రతిభ కనబరచడంపై గ్రామస్తులు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి తదితరులు లోకేష్‌ను అభినందించారు.

ఓటు హక్కుపై అవగాహన సదస్సు



సుందరపల్లిలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సీఐ దొరరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై నరేష్

కె.గంగవరం: మండలంలోని సుందరపల్లిలో పామర్రు ఎస్సై జానీ బాషా ఆధ్వర్యంలో ఓటు హక్కు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రపురం సీఐ పి.దొరరాజు మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటు హక్కు ఉపయోగించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఎన్నికలకు సహకరించాలి

రాయవరం: సాధారణ ఎన్నికల నిర్వహణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని రాయవరం ఎస్సై జి.నరేష్ పిలుపునిచ్చారు. రాయవరంలో మంగళవారం ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రజలు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ఎన్నికల ప్రకటన రానున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడకుండా చూడాలన్నారు. ఎటువంటి కోపతాపాలకు తావివ్వకూడదని, గొడవల్లో ఇరుక్కుంటే కేసులు నమోదు అవుతాయన్నారు. ఎవరూ భవిష్యత్‌ను నాశనం చేసుకునేలా ఘర్షణలకు దిగరాదన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అందరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ నవుడు వెంకటరమణ, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఆర్ఐ పంపన రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య సంబరాలు



సాహిత్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామకు చెందిన నెహ్రూ సాహితీ సమితి ఆధ్వర్యంలో సాహిత్య సంబరాల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి 11 పాఠశాలల విద్యార్థులకు పద్య పఠనం, ముఖాభినయం, పదంతో పద్యాలు, పురాణాల నుంచి ప్రశ్నలు, పద్యాంతాక్షరి తదితర సాహిత్య ప్రక్రియల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని పద్మావతి, మహాత్మా జ్యోతీరావ్ పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పావన్యల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అదే విధంగా సమితి అధ్యక్షురాలు అంజనీదేవి, కార్యదర్శి సుబ్బారావు గోపి, సాంస్కృతిక కార్యదర్శి బీబీఎస్ తిలక్, మండలేముల కాశీ విశ్వనాథం, మహావాది సత్యవతి, పోచినపెద్ది రామకృష్ణ విఠల్ల చేతుల మీదుగా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు.

ఆసరా చెక్కుల పంపిణీని విజయవంతం చేయండి

కాజులూరు: గ్రామంలో నేటి మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరగనున్న వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని సర్పంచ్ దండంగి సరోజిని కోరారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లోని సభా ప్రాంగణంలో సర్పంచ్ దండంగి సరోజిని, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీసెల్ నాయకులు దండంగి చిన్నారావు తదితర నాయకులు మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ తదితర నేతలు ఈ భారీ బహిరంగ సభలో పాల్గొని ఆసరా చెక్కు పంపిణీ చేస్తారన్నారు. మండల గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

కరాటేలో ద్రాక్షారామ చిన్నారుల ప్రతిభ



కరాటే పోటీల్లో గెలుపొందిన పతకాలు, సర్టిఫికెట్లతో ద్రాక్షారామ చిన్నారులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 11న అమలాపురంలో నిర్వహించిన 4వ స్టేట్ లెవెల్ ఇన్విటేషనల్ కరాటే పోటీల్లో ద్రాక్షారామకు చెందిన చిన్నారులు సత్తా చాటారు. సీనియర్ స్పారింగ్ విభాగంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎ.సంతోష్, శ్రీ చైతన్య విద్యార్థులు పి.తేజ, బి.హేమ, సూర్య స్కూల్ విద్యార్థి ఎం.శ్రీజ, స్కైలార్క్ విద్యార్థులు కె.విష్ణు, కె.సంజీవ్, భాష్యం విద్యార్థి ఎస్.ఇష్ట బంగారు పతకాలు సాధించారు. జూనియర్ స్పారింగ్ విభాగంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బి.దుర్గాప్రసాద్, డి.ఆంజనేయులు, సూర్య స్కూల్ విద్యార్థులు వి.మహేష్‌కార్తిక్, కె.కిషోర్‌రాజు, బి.హిమవంత్, ఎం.హేమంత్, బాష్యం విద్యార్థి ఎస్.నాగచైతన్య రజత పతకాలు సాధించారు. కరాటేలో ప్రతిభ కనబరిచిన చిన్నారులను, వారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ పి.బాలకృష్ణలను సీనియర్ కరాటే మాస్టర్ బీకే రత్నం, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి మాగాపు అమ్మిరాజు, ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర అభినందించారు.

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం



సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా దీర్ఘకాలంగా సేవలందించి ఇటీవలే ఉద్యోగ విరమణ చేసి మండపేట పట్టణానికి చెందిన వర్రే సత్యనారాయణ మూర్తి దంపతులను లయన్స్ క్లబ్ నిర్వాహకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. క్లబ్ నాయకులు కర్రి నారాయణరెడ్డి సీహెచ్ రాంబాబు, వీర్రాజు, జీఎస్ శ్రీనివాసరావు, వాడా ప్రసాదరావు మాట్లాడుతూ విద్యారంగంలో విశేష సేవలందించిన ఘనత వర్రే సత్యనారాయణ మూర్తికి దక్కుతుందన్నారు.

గ్రూప్-2 పరీక్ష కేంద్రం పరిశీలన

మలికిపురం: మండలంలోని ఏఎఫ్‌డీటీ ఎయిడెడ్ విద్యా సంస్థల ఆవరణను మంగళవారం డీఎల్డీఓ ఎస్.రాజేశ్వరరావు పరిశీలించారు. ఈ నెల 25న గ్రూప్-2 పరీక్షలను నిర్వహించేందుకు పరిశీలన చేశారు. సుమారు 700 మంది దరఖాస్తుదారులు ఇక్కడ పరీక్ష రాసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, ఏఓ ఎస్.రాకేశ్ ఆయన వెంట ఉన్నారు.

పళ్లాలమ్మ క్షేత్రానికి నూతన వైభవం

- వానపల్లిలో రూ.84.50 లక్షలతో ఆలయ ముఖమండపం, రాజగోపురం నిర్మాణం
- నేడు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు భాస్కరరామం చేతుల మీదుగా శిఖరప్రతిష్ఠ, ప్రారంభోత్సవ కార్యక్రమాలు



వానపల్లి పళ్లాలమ్మ ఆలయం వద్ద నిర్మించిన ముఖ మండపం, రాజగోపురం

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవతగా, ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న పళ్లాలమ్మ అమ్మవారి క్షేత్రం నూతనంగా సుమారు రూ.1.80 కోట్లతో నిర్మించిన కట్టడాలతో సరికొత్త వైభవాన్ని సంతరించుకుంది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఆ గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం (ప్రజా ప్రయోజనాలు) ప్రత్యేక కృషి మేరకు దేవదాయ-ధర్మాదాయ శాఖ సీజీఎఫ్ నిధుల మంజూరుతో ఆలయ ముఖ మండపం, రాజగోపురం నిర్మాణం కాగా బుధవారం వాటి ప్రారంభోత్సవం, శిఖర ప్రతిష్ఠ, ప్రాకార మండపానికి భూమిపూజ నిర్వహించేందుకు ఆ దేవస్థానం కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పళ్లాలమ్మను ప్రకృతిమాతగా కొలిచిన సీతాదేవి

సీతారాములు వనవాస కాలంలో పళ్లాలమ్మ అమ్మవారిని కొలిచినట్టు ప్రకృతిమాతగా సీతాదేవి స్థలపురాణంలో పేర్కొన్నారు. బ్రిటిష్ వారి పాలనలో సర్ ఆర్థర్ కాటన్ బీడు భూములను పంట భూములుగా మార్చాలనే తలంపుతో అఖండ గోదావరి నదిపై బ్యారేజ్ నిర్మించి, కాలువలను తవ్వించి, సాగునీరు మళ్లించినప్పుడు నాడు వానరపల్లి అనబడే నేటి వానపల్లి వద్ద పళ్లాలమ్మ ఆలయం అడ్డురాగా ఇంజినీరింగ్ అధికారులు ఆలయం తొలగించే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నాన్ని కాటన్ వారించి ఆలయాన్ని అలాగే ఉంచి ఆలయం పక్క నుంచి కాలువ వెళ్లేలా అక్కడ వంపు తిప్పమని సూచించినట్టు కూడా ఆ స్థల పురాణంలో పేర్కొన్నారు. అలా ఆ ఆలయం చెక్కుచెదరకుండా నిలిచింది. విజయనగర సంస్థానాధీశుల పాలనలో పలువురు భూస్వాములు ఈ ఆలయానికి 39 ఎకరాలు భూమి దానం చేయగా దానిలో పూర్వీకులు నిర్మించిన ఈ ఆలయం 1969లో దేవదాయ శాఖ పరిధిలో విలీనమైంది. నాడు సీతాదేవి కొలిచిన ఈ అమ్మవారు ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పుగా గుర్తింపు పొందింది. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం నుంచి తీర్థం ప్రారంభమై నెలరోజుల పాటు జరగడం పూర్వం నుంచీ ఆనవాయితీగా వస్తుంది.

ఎమ్మెల్యే చిర్ల, నేమాని సంయుక్త ఆధ్వర్యంలో అభివృద్ధి

ఎన్నో సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టున్న ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, గ్రామానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం సంయుక్త ఆధ్వర్యంలో రూపకల్పన చేశారు. ఆ ప్రతిపాదనలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆమోదంతో ఆలయ ముఖ మండపం, రాజగోపురం నిర్మాణానికి రూ.80 లక్షలు దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధులు మంజూరు చేయించారు. దానికి మ్యాచింగ్ గ్రాంటు రూ.8 లక్షలు చెల్లించవలసి ఉండగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.3 లక్షలు, పాలకమండలి చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, కొత్తపేట పీఏసీఎస్ చైర్‌పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు రూ.లక్ష చొప్పున, 2007 జాతర కమిటీ రూ.1,77,777, గ్రామస్తులు రూ.1.25 లక్షలు చెల్లించారు. మండపంపైన శాలాహారాన్ని చైర్మన్ అమ్మన్న ఆధ్వర్యంలో దాతల నుంచి రూ.4.50 లక్షలు సేకరించి నిర్మించారు.

నేడు ప్రారంభోత్సవం

ఆలయ ముఖమండపం, రాజగోపురాన్ని బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు భాస్కరరామం ప్రారంభించనున్నారు. ప్రత్యేక పూజలతో రాజగోపురం శిఖర ప్రతిష్ఠ చేయనున్నారు. అనంతరం రూ.85 లక్షల సీజీఎఫ్ నిధులతో ఆలయం చుట్టూ నిర్మించే ప్రాకార మండపం నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు.

చరిత్రలో అభివృద్ధి కార్యక్రమాలు

ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామ దేవత పళ్లాలమ్మ ఆలయం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, మా గ్రామస్తుడైన ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కరరామం సహకారం, ప్రభుత్వంలో వారికున్న పలుకుబడి అభివృద్ధికి దోహదపడింది. నేడు వారి కృషితో జరిగిన ఈ అభివృద్ధి కార్యక్రమాలు చరిత్రలో నిలుస్తాయి. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిన వారందరికీ పాలకమండలి, గ్రామం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. భవిష్యత్‌లో జగ్గిరెడ్డి, భాస్కరరామం కృషి, దాతల సహకారంతో మొక్కుబడులు తీర్చుకునే భక్తులు వంటలు చేసుకుని, భోజనాలు చేసుకునేందుకు వీలుగా షెడ్డులు నిర్మించే ప్రతిపాదన ఉందన్నారు.

– కామిశెట్టి అమ్మన్న, దేవస్థాన పాలకమండలి చైర్మన్, వానపల్లి